సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం : 28 : ఏప్రిల్ : 2023



నిండుప్రాణాలు బలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల తీరుతో నిండు ప్రాణాలు బలవుతున్నాయి.

వివరాలు 8లో ▸



'భగీరథ' జయంతి

భగీరథ మహర్షి జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

వివరాలు 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.7 /23.6

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు హైకోర్టు న్యాయమూర్తులు

పాలమూరు: జిల్లా బార్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణగార్డెన్స్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే మరో హైకోర్టు జడ్జి పి.రమాదేవి, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి హాజరవుతున్నారు.

నేడు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈనెల 12వ తేదీన వాయిదా పడిన జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పనుల స్టాండింగ్ కమిటీ సమావేశం, మధ్యాహ్నం 2.30 ప్రణాళిక, ఆర్థిక స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ పరీక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పది కేంద్రాల్లో ఓపెన్ స్కూల్‌కు సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం పదోతరగతిలో మొత్తం 158మంది విద్యార్థులకు గాను 136మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్‌లో 819మందికి గాను 703మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆయా కేంద్రాలను డీఈఓ యాదయ్యతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

1 నుంచి కరాటే ఉచిత శిక్షణ శిబిరం

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు జిల్లాకేంద్రం జెడ్పీ కార్యాలయం ఆవరణలో ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సీనియర్ కరాటే మాస్టర్, టీఎస్ఎస్‌కేఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎతినె చెన్నయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కరాటే, జూడో, నాంచాక్, జపాన్ ఆయుధ శిక్షణ, యోగా అంశాల్లో శిక్షణ అందజేస్తామని పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. మిగతా వివరాల కోసం 9393330896 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

'పీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తున్నాం'

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారులు, ఈపీఎఫ్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా నోడల్ అధికారి రమేష్ చావా తెలిపారు. ప్రతి నెల 27న నిర్వహించే పీఎఫ్ ఖాతాదారులు, ఈపీఎస్ పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో పెన్షన్ అదాలత్ నిర్వహించారు. ఆప్‌కేనికట్ 2-0 కార్యక్రమంలో పీఎఫ్‌కు సంబంధించిన సమస్యలు, పీఎఫ్ సభ్యత్వ ఉపయోగాలు, ఎంప్లాయి డిపాజిట్ లింక్డ్, ఇన్సూరెన్స్‌లపై 90 మందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు అధిక పెన్షన్ ఆప్షన్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఎఫ్ సీనియర్ అసిస్టెంట్ రాజు నాయక్, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, నర్సింహులు, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,030

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,030, కనిష్ఠంగా రూ.4,060 ధరలు లభించాయి. మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.1,834, కనిష్ఠంగా రూ.1,406, ఆముదాలు గరిష్ఠంగా రూ.5,630, కనిష్ఠంగా రూ.5,160, హంస రకం ధాన్యం గరిష్ఠంగా రూ.1,849, కనిష్ఠంగా రూ.1,509, ఆర్ఎన్ఆర్ రకం గరిష్ఠంగా రూ.2,329, కనిష్ఠంగా రూ.1,414 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో నిర్వహించిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,129, కనిష్ఠంగా రూ.1,359గా ధరలు నమోదయ్యాయి.హంస ధాన్యం గరిష్ఠంగా రూ.1,829, కనిష్ఠంగా రూ.1,431, ఆముదాలు గరిష్ఠంగా రూ.5,539, కనిష్ఠంగా రూ.5,509గా ధరలు లభించాయి. మార్కెట్‌కు 5వేల బస్తాల ధాన్యం, వంద బస్తాల ఆముదాలు అమ్మకానికి వచ్చాయి.



చిన్నచింతకుంట మండలంలో కొనసాగుతున్న మైనింగ్ (ఫైల్)

మైనింగ్ ఆదాయం.. ఢమాల్

- గత రెండేళ్లలో గణనీయంగా తగ్గిన ఆదాయం
- కొత్త మైనింగ్ పాలసీపై ప్రభుత్వం దృష్టి
- భారీ సంస్కరణల దిశగా అడుగులు
- కరోనా తర్వాత పరిస్థితులను అధిగమించేందుకు చర్యలు

ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల జాప్యంతో తగ్గిన రాబడి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గనులు, భూగర్భ శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గిపోతోంది. 2021- 22 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే.. 2022- 23లో దాదాపు సగానికి పడిపోవడం గమనార్హం. ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిలో జరుగుతున్న జాప్యం, కేసుల కారణంగా మైనింగ్ శాఖకు వచ్చే ఆదాయం భారీగా తగ్గింది. ఈ క్రమంలో గనులు, భూగర్భ శాఖలో భారీ సంస్కరణలు తీసుకొచ్చే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలనే లక్ష్యంతో కొత్త మైనింగ్ పాలసీ తీసుకొచ్చేందుకు ప్రణాళిక తయారు చేస్తోంది. పర్యావరణహితంగా గనుల తవ్వకం చేపట్టి ప్రభుత్వ ఖజానాకు అధిక ఆదాయాన్ని సమకూర్చడమే లక్ష్యంగా ఖనిజ ఆధార పరిశ్రమలు నెలకొల్పడం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతోంది.

రాబడిలో కీలకపాత్ర

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో ఈ శాఖదే కీలక పాత్ర. ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేసులు, కరోనా వైరస్ కారణంగా రెండేళ్లుగా గనులు, భూగర్భశాఖ ద్వారా రావాల్సిన ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అందుబాటులో ఉన్న సాంకేతిక టెక్నాలజీ సాయంతో భూగర్భ ఖనిజ నిక్షేపాలను గుర్తించి వాటి కేటాయింపుల ద్వారా ఆదాయాన్ని భారీగా సమకూర్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందుకోసం గనులు భూగర్భశాఖలో సమూల మార్పులు తీసుకురావడంలో భాగంగా విధివిధానాలను ఖరారు చేసి కొత్త పాలసీని అమలు చేయాలని భావిస్తోంది. గనులు, భూగర్భ శాఖ ద్వారా రాబోయే రోజుల్లో కొత్త పాలసీ అమలు చేయనున్న దృష్ట్యా స్వయంగా మైనింగ్ చేసేందుకు కొత్తగా దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేసి.. గతంలో మంజూరైన ఖనిజ క్వారీ లీజులను మాత్రమే కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జిల్లాలో అపారమైన సంపద

మహబూబ్‌నగర్ జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉంది. ప్రధానంగా క్వార్ట్జ్, ఫెల్ట్‌సర్, కలర్ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్, స్టోన్ మెటల్ గ్రావెల్ వంటి ఖనిజ నిక్షేపాలు మెండుగా ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఈ జిల్లా నుంచి రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. కరోనా వైరస్ రాక ముందు జిల్లాకు ఇచ్చే లక్ష్యానికి మించి రెట్టింపు స్థాయిలో ఆదాయం వచ్చేది. తదనంతరం ఈ ఆదాయం తగ్గుతూ వచ్చింది. కరోనా వైరస్‌తో ఇతర ప్రాంతాల నుంచి గనుల్లో పనిచేయడానికి ఉపాధి కోసం వచ్చి కార్మికులు వారి సొంత ప్రాంతాలకు వెళ్లడంతో పనులు నిలిచిపోవడం, ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేసులు పడటం వంటి కారణాలతో ఖనిజ ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది.

జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న 64 లీజుల ద్వారా 2021- 22 ఆర్థిక సంవత్సరంలో రూ.70.17 కోట్ల ఆదాయం రాగా.. 2022- 23 ఆర్థిక సంవత్సరంలో రూ.36.304 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. అయితే 2021- 22లో వచ్చిన ఆదాయాన్ని పరిశీలిస్తే 2022-23లో రూ.33.87 కోట్లు తక్కువగా వచ్చింది. ఖనిజ అక్రమ రవాణాపై జరిమానా రూపంలో 2021- 22 ఆర్థిక సంవత్సరంలో 62 కేసులు నమోదు చేయగా రూ.8.82 లక్షల ఆదాయం వచ్చింది. 2022- 23లో మొత్తం 228 కేసులు నమోదు చేసి రూ.19.01 లక్షలు జరిమానా వసూలు చేశారు. 2022- 23 ఆర్థిక సంవత్సరంలో ఖనిజ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం గట్టి నిఘా పెట్టగా కేసుల సంఖ్య పెరిగి జరిమానాలు ఎక్కువగా వసూలయ్యాయి.

రెండేళ్లలో ఆదాయం(రూ.లలో..) వివరాలిలా..

నెల	2021- 22	2022- 23
ఏప్రిల్	1,25,78,128	1,45,57,114
మే	92,00,353	2,13,81,614
జూన్	15,56,82,126	2,10,08,394
జూలై	4,72,60,109	4,74,94,546
ఆగస్టు	1,26,74,842	4,87,03,272
సెప్టెంబర్	4,13,73,919	5,55,70,692
అక్టోబర్	3,38,47,934	1,25,45,400
నవంబర్	4,61,42,825	5,66,44,871
డిసెంబర్	11,89,51,232	1,46,24,658
జనవరి	6,68,96,190	1,08,00,269
ఫిబ్రవరి	7,31,90,815	3,25,19,978
మార్చి	8,39,97,244	2,72,89,203
మొత్తం	70,17,95,717	36,30,41,828

15 మండలాల్లో.. 64 లీజులు

జిల్లాలోని హన్వాడ, నవాబుపేట, భూత్పూర్, మూసాపేట, బాలానగర్, రాజాపూర్, కోయిలకొండ, దేవరకద్ర, చిన్నచింతకుంట, గండీడ్, మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్, అడ్డాకుల, మిడ్జిల్, జడ్చర్ల మండలాల్లో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆయా మండలాల్లో ప్రస్తుతం 64 లీజులు కొనసాగుతున్నాయి.

ఖనిజం, లీజుల వివరాలు..

ఖనిజం	లీజులు
క్వార్ట్జ్, ఫెల్ట్‌సర్	17
క్వార్ట్జ్	5
స్టోన్, మెటల్	29
కలర్ గ్రానైట్	1
బ్లాక్ గ్రానైట్	7
స్టోన్, మెటల్ గ్రావెల్	5

ప్రాజెక్టులు ఆగిపోవడం వల్ల..



రెండేళ్లుగా మైనింగ్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం చాలా వరకు తగ్గిపోయింది. జిల్లాలో నడుస్తున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఆగిపోవడం వల్ల వాటి నుంచి వచ్చే ఆదాయం నిలిచిపోయింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలలోని రెండు ప్యాకేజీ పనులు ఆగాయి. కొత్త మైనింగ్ పాలసీపై దృష్టిసారించి ఆశించిన ఆదాయాన్ని సమకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– విజయ్‌కుమార్, మైనింగ్ ఏడీ

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ధరణికి చెందిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించేందుకు తహసీల్దార్లు కృషి చేయాలని కలెక్టర్ రవినాయక్ సూచించారు. గురువారం ఆయన వెబ్‌ఎక్స్ ద్వారా తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో భూములకు సంబంధించి వచ్చే దరఖాస్తుల సంఖ్య సైతం తగ్గిందని, దీనిని కొనసాగించాలని కోరారు. ధరణితో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి వచ్చే ఏ దరఖాస్తు అయినా నెలకు మించి పెండింగ్‌లో ఉంచుకోవద్దని ఆదేశించారు. జీఎంఎల్‌లో 197 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. ముందుగా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించి ముందుగా వాటిని పూర్తి చేయాలన్నారు. పెండింగ్ మ్యుటేషన్‌లకు సంబంధించి వందశాతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాతనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఎన్నికల అంశానికి సంబంధించి బీఎల్‌ఓ లాగిన్‌పై దృష్టి సారించాలని, ఓటర్ జాబితాలో ఇంకా పరిశీలించని దరఖాస్తులు, ఎన్నికల సంఘం ఆదేశం మేరకు సమర్పించాల్సిన రిపోర్టులను తక్షణమే పంపించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి కమిషన్ ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ ఆఫీసులో క్లోజ్ చేయాల్సిన ఫైళ్లను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు సర్టిఫికెట్లను జారీ చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, అక్రమ ఇసుక రవాణా, పట్టుకున్న ఇసుక తదితర వాటిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామరావు, ఆర్డీఓ అనిల్ కుమార్, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్ రావు, మైనింగ్ ఏడీ విజయకుమార్, కలెక్టర్ కార్యాలయ ఏఓ శంకర్ పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

- 30న కానిస్టేబుల్ తుది రాత పరీక్ష
- హాజరుకానున్న 14,388మంది అభ్యర్థులు
- పాలమూరులో 31 పరీక్ష కేంద్రాల ఏర్పాటు: ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: ఈనెల 30న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు కానిస్టేబుల్ తుది రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కె.నరసింహ వెల్లడించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు పరిశీలకులకు శిక్షణ నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మొత్తం 31 పరీక్ష కేంద్రాల్లో 14,388 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, పోలీస్‌శాఖ నుంచి పూర్తి భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఒక ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీ, పదిమంది సీఐలు, 40మంది ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ కలిపి 200 మందితో పోలీస్ భద్రత ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల దగ్గర ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మూడు అంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్ష రాయడానికి వస్తున్న అభ్యర్థులు రెండు గంటల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షకు ఒక గంట ముందు అభ్యర్థులను హాలులోకి అనుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్లు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, గుర్తింపు కార్డు (ఆధార్, ఓటర్ ఐడీ, లైసెన్స్) తీసుకురావాలన్నారు. ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను కేంద్రంలోని అనుమతి ఇవ్వమని చెప్పారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఇతర సిబ్బందికి కూడా ఇది వర్తిస్తుందన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలో ఉన్న జిరాక్స్, ఇంటర్‌నెట్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. సమావేశంలో పరీక్ష నోడల్ అధికారి, ఏఎస్పీ రాములు, రీజనల్ కో-ఆర్డినేటర్ సుజీవన్‌కుమార్ పాల్గొన్నారు.

కదం తొక్కిన పంచాయతీ కార్యదర్శులు



కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ కార్యాలయం నుంచి నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని కొత్త కలెక్టరేట్ వరకు ఏడు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట బైఠాయించి తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరించి వారు పనిచేసిన కాలాన్ని సర్వీసుగా పరిగణించాలన్నారు. నాలుగేళ్లుగా ఎన్నో కష్టనష్టాలు పడి ప్రభుత్వ పథకాలను అధికారుల సహాయంతో గ్రామా అభివృద్ధి కృషి చేసిన దాని ఫలితంగా దేశంలోనే ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు వచ్చాయన్నారు. అలాంటి మాపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,లక్ష్మీకాంత్, పాండు, రవి, రఘుపతిరెడ్డి, నర్మద, శిరీష, సరస్వతి, శ్రీలత, కృష్ణ, వేణు, జ్ఞానేశ్వర్, సింధుజ, రాకేష్, సంతోష్, శ్రీను, చెన్నకేశవులు, మంజుల, అనురాధ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి



చిన్నారులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సిరాజుద్దీన్

పాలమూరు: గ్రామస్థాయిలోకి ఉచిత న్యాయ సహాయాన్ని తీసుకెళ్లేందుకు ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు కృషి చేయాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో గురువారం సఖి కేంద్రం ప్రతినిధులు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అగ్రి లీగల్, ఎయిడ్ క్లినిక్‌ల ఏర్పాటు, సఖి కేంద్రంలో గృహహింస కేసుల వివరాలు, బాలసదన్, స్టేట్ హోం నిర్వహణపై చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేవరకద్రలోని రైతు వేదికలో అగ్రి లీగల్ పెయిడ్ కేంద్రం ప్రారంభించామని, త్వరలో కోయిలకొండలోని రైతు వేదికలో అగ్రి లీగల్ పెయిడ్ క్లినిక్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్‌ల ద్వారా వారానికి రెండు రోజుల పాటు పారా లీగల్ వలంటీర్లు రైతులకు న్యాయ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అక్కడ పరిష్కరించలేని అంశాలను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

■ మహబూబ్‌నగర్‌లోని బాలసదన్, స్టేట్ హోంలను గురువారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి సందర్శించారు. స్టేట్ హోంలో చట్టాలపై అవగాహన కల్పించారు. శిశు గృహాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

నకిలీ ఇన్సూరెన్స్‌తో టోకరా

అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసిన గద్వాల పోలీసులు

- 8 కంపెనీల లోగోలు, రబ్బరు స్టాంపులు స్వాధీనం
- వాహనాల నకిలీ ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌లు సైతం తయారీ
- ప్రింటర్లు, 17 సెల్‌ఫోన్లు సీజ్
- 17 మంది అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సృజన



వివరాలను వెల్లడిస్తున్న జోగులాంబ గద్వాల ఎస్పీ సృజన.. చిత్రంలో పట్టుబడిన ముఠా సభ్యులు

గద్వాల క్రైం: ఏ వాహనం అయినా సరే రామస్వామి కంపెనీలో ఇట్టే దొరుకుతాయి. ఇన్సూరెన్స్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ ఇలా ఏదీ కూడా ఒరిజినల్‌కు ఏమాత్రం తీసిపోదు. దీనిని గుర్తించే సామర్థ్యం ఎవరికీ లేదు. మన సంస్థలో ఏజెంట్లుగా చేరండి మీకు 50 శాతం.. నాకు 50 శాతం పంచేసుకుందాం. ఇక మనకు కావాల్సిన ముడి సరుకు అమాయక వాహన యజమానులు, డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే వ్యక్తులు అయితే.. మన కృషి, పట్టుదల ఆర్టీఏ ఏజెంట్లుగా ఉన్న అనుభవమే.. అంటూ ఓ ముఠా రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.కోట్లు దండుకునే పథకం పన్నారు. చివరికి జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసుల చేతికి చిక్కి కటకటాపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఎస్పీ సృజన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

కర్నూలు కేంద్రంగా..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన మీసాల రామస్వామి గత కొన్నేళ్లుగా కర్నూలు ఆర్టీఏ కార్యాలయం వద్ద ఆర్టీఏ ఏజెంట్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పరిచయాలు పెంచుకొని, కంప్యూటర్ పరిజ్ఞానం సాధించాడు. దీంతో పలు వాహనాలకు ఫిట్‌నెస్, ట్రాన్స్‌ఫర్, పర్మిట్, ఇన్సూరెన్స్‌లను సొంతంగా తయారు చేసి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాడు. నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకుని పలు కంపెనీల ఇన్సూరెన్స్‌ల పేరిట నకిలీ పత్రాలను తయారీ చేసి మోసం చేస్తున్నాడు. అయితే 2015 సంవత్సరంలో నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేస్తున్నట్లు అక్కడి సిబ్బంది గుర్తించి పోలీసులకు అప్పగించారు. జైలు శిక్ష అనంతరం ఈ వృత్తిలో మరింత పైచేయి సాధించి ఏపీలోని ప్రకాశం, ఒంగోలు, అనంతపురం, నంద్యాల, కోడుమూర్, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, గద్వాల, నల్లగొండ తదితర ఆర్టీఏ ఏజెంట్లతో ఉన్న సంబంధాలతో నకిలీ ఇన్సూరెన్స్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌ల తయారీకి శ్రీకారం చుట్టాడు. ప్రతి ఏజెంట్‌కు 50 శాతం మేర ఒప్పందం కుదుర్చుకుని గుట్టుగా ఈ వ్యవహారం సాగిస్తున్నాడు.

ముఠా సభ్యులు వీరే..

ముఠా సభ్యుడు విచారణలో వెల్లడించిన వివరాల మేరకు 16 మంది సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో కర్నూలుకు చెందిన గురప్పగారి చంద్రకుమార్, తలనేరు రవికుమార్, నేచనమిట్ట శ్రీకాంత్ (కరూర్ వైశ్య బ్యాంకు మేనేజర్), జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఆకేపోగు సుధాకర్, తెలుగు విశ్వనాథ్, తెలుగు మధుసూదన్, మంత్రాలయంకు చెందిన గుండెపోగుల రంగన్న, మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండకు చెందిన షఫీ, వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్లకు కోళ్ల ప్రేమకుమార్, నాగర్‌కర్నూల్ జిల్లాలో పనిచేసే పాలకొండకు పొత్తిలి సురేష్‌గౌడ్, నంద్యాలకు చెందిన ఆటోడ్రైవర్ బోయిని నగేష్, నల్లగొండ జిల్లా పెద్దబండకు చెందిన కొత్ర లక్ష్మయ్య, గద్వాల జిల్లా అయిజ మండలం మేడికొండకు చెందిన తిమ్మయ్యగారి కిరణ్‌కుమార్‌రెడ్డి (కర్నూలులోని అయ్యప్ప ఆటో ఫైనాన్స్ సిబ్బంది), కోడుమూర్‌కు చెందిన ఆర్టీఏ ఏజెంట్ తలనేరు మాధవస్వామి, కర్నూలు పట్టణం ఆటోనగర్‌కు చెందిన సాగినల రఘునాథ్‌రెడ్డి, కర్నూలు పట్టణం సంజీవగాంధీనగర్‌కు చెందిన దాసరి ప్రవీణ్‌కుమార్ (కర్నూలో సుభ ఆటోఫైనాన్స్)లను అరెస్ట్ చేసి వారి నుంచి పలు కంపెనీలకు సంబంధించిన నకిలీ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లు, ఆర్సీలు, కారు, కలర్ ప్రింటర్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. కేసును డీఎస్పీ రంగస్వామి, సీఐ సూర్యనాయక్, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది చాకచక్యంగా ఛేదించారన్నారు. మరి కొంతమంది ముఠా సభ్యులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఇందులో రవాణా శాఖ అధికారుల పాత్రపై విచారణ చేపట్టి ఈ ముఠాకు సహకరించిన వారిని సైతం అదుపులోకి తీసుకుంటామన్నారు. ఈ సంఘటనపై ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. అరెస్టు చేసిన వారిని అలంపూర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

పట్టుబడింది ఇలా..

ఈ వ్యవహారంపై ఓ వ్యక్తి గద్వాల జిల్లా పోలీసులకు ఈ నెల 24న నమ్మదగిన సమాచారం అందించాడు. దీంతో అలంపూర్ చౌరస్తాలో నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలను కొంత మంది ఏజెంట్లకు ఇచ్చేందుకు కారులో ముఠా సభ్యుడు వచ్చాడు. అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముఠా సభ్యుడితో కలిపి 16 మంది నిందితులను అరెస్టు చేసి 8 కంపెనీల లోగోలు, ల్యాప్‌ట్యాబ్‌లు, ప్రింటర్లు, 17 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇంటి వద్దే తయారీ కేంద్రం..

నకిలీ ఇన్సూరెన్స్ తయారీకి ముందుగా కంపెనీలైన చోళమండలం, శ్రీరాం, ఫోర్‌టూన్, చోళ ఎంఎస్, ఇండ్‌సడ్ బ్యాంకు, ఎఫ్ఐ, భారతి, టాటా, మహీంద్ర, హిందూజ, లేల్యాండ్, కనకదుర్గ వంటి ప్రైవేట్ కంపెనీల లోగో, రబ్బరు స్టాంపులు, ఆర్సీలు, డ్రైవింగ్ పత్రాలను ఒరిజినల్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా తయారు చేసే కేంద్రాన్ని తన ఇంటి వద్దే ఏర్పాటు చేసుకున్నాడు. ఇలా గత ఎనిమిదేళ్లుగా పలు వాహనాలకు నకిలీ ఇన్సూరెన్స్ చేయించడం వచ్చిన డబ్బుల్లో సగం సగం తీసుకునేవారు. ఈ క్రమంలో కొందరు ఆర్టీఏ అధికారులతోపాటు క్లర్క్‌లకు మామూళ్లు అందిస్తూ ఈ వ్యవహారం కొనసాగిస్తున్నారు. దాదాపు ఇప్పటి వరకు 8 వేలకుపైగా వాహనాలకు నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలు అందించి రూ.కోట్లలో దండుకున్నారు.





ముఠా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లు, ప్రింటర్లు

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి గురై రైతు మృతి

హన్వాడ: మండలంలోని కారంతండాకు చెందిన రైతు వెంకట్‌నాయక్ (40) గురువారం విద్యుత్ షాక్ గురై మృతిచెందినట్లు ఎస్ఐ రవి నాయక్ చెప్పారు. ఎస్ఐ కథనం ప్రకారం.. కారంతండాకు చెందిన రైతు వెంకట్‌నాయక్ తన వ్యవసాయ పొలంలో పశువుల కోసం గడ్డి తీసుకొని రావడానికి వెళ్లాడు. గడ్డిమోపుతో పాటు కొడవలిని గడ్డిపై పెట్టుకొని వస్తుండగా అకస్మాత్తుగా కొడవలి విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై వెంకట్‌నాయక్ భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వెంకట్‌నాయక్‌కు భార్యతోపాటు నలుగురు సంతానం ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

ఉప్పునుంతల: ఉప్పునుంతల– గట్టుకాడిపల్లి రహదారి పక్కన ఓ వ్యవసాయ పొలంలో వేప చెట్టుకు ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. వంగూరు మండలం చింతపల్లికి చెందిన బద్దుల రవి (28) లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బంధువులకు ఫోన్‌చేసి రూ.12 వేలు ఇవ్వాలని.. లేదంటే చనిపోతానని బెదిరించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గ్రామ పరిసరాల్లో వెదుక్కొంటూ ఉప్పునుంతల వైపు వచ్చారు. రహదారి పక్కన బైక్ కనబడటంతో సమీప పొలాల్లో వెతకగా.. లుంగీతో చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. గురువారం తండ్రి బద్దుల లింగమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

బాలానగర్‌లో మరొకరు..

బాలానగర్: మండల కేంద్రంలో రాజేష్ (22) గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 3 నెలల క్రితమే తల్లి కృష్ణవేణి సైతం ఆత్మహత్య చేసుకుందని.. రాజేష్‌కు సోదరుడు చింటుతో పాటు తండ్రి రాములు ఉన్నారన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


రాజేష్ (ఫైల్)

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖిల్లాఘనపురం: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం మండలంలోని నేలబండతండా సమీపంలో లభ్యమైంది. తండావాసులు, పోలీసుల కథనం ప్రకారం.. గురువారం మధ్యాహ్నం కొందరు గొర్రెల కాపరులు నేలబండ తండా సమీపంలో గొర్రెలను మేపుతుండగా హీర్లతండా కు చెందిన గణేష్ నాయక్ వ్యవసాయ పొలంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి కనిపించింది. ఈ విషయాన్ని తండా గిరిజనులకు కాపరులు తెలిపారు. హీర్ల తండా సర్పంచ్ గోపాల్‌నాయక్ తండావాసులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీహరి సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిశీలించారు. సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల పురుషుడిదని, సుమారు 20 రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని ఎస్సై తెలిపారు. కనత భాగంలో ఆపరేషన్ చేసి ఉన్నదని, లోపలి భాగాన వైద్యులు అమర్చిన పిన్ ఉందన్నారు. ఈ విషయమై సర్పంచ్ గోపాల్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా

బిజినేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరు చనిపోవడానికి కారణమైన వ్యక్తికి 6 నెలల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్లు నాగర్‌కర్నూల్ కోర్టు ఏపీపీ రవికుమార్ తెలిపారు. 2014 ఆగస్టు 27న మండలంలోని శాయిన్‌పల్లికి చెందిన అశోక్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల తిమ్మాజిపేట మండలానికి చెందిన నర్సింహ అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై గురువారం సెకండ్ అడిషనల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి పి.మౌనిక పైవిధంగా తీర్పును వెలువరించారని ఏపీపీ చెప్పారు.

ప్రయాణికుడిపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: అర్ధరాత్రి ఆటోలో ఎక్కిన ప్రయాణికుడిపై దాడి చేసి అతని దగ్గర ఉన్న డబ్బులు, సెల్‌ఫోన్ తీసుకుని ఐదుగురు వ్యక్తులు పరారయ్యారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా గౌతపూర్ గ్రామానికి చెందిన రవికుమార్ అనే వ్యక్తి కర్నూలులో ఉన్న అతని బావ దగ్గరకు వెళ్లడానికి బుధవారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటల ప్రాంతంలో జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్ చౌరస్తాలో భూత్పూర్ వెళ్లే ఆటోలో ఎక్కాడు. అందులో అప్పటికే ఐదుగురు వ్యక్తులు ఉండటంతో రవికుమార్ కూడా ఆటోలో ఎక్కాడు. ఆ తర్వాత ఆటో డ్రైవర్ క్రిస్టియన్‌పల్లి దాటిన తర్వాత ఆటోను బైపాస్ రోడ్డులో కొంత దూరం తీసుకెళ్లి నిలిపాడు. టాయిలెట్ వస్తోంది కిందకు దిగామని చెప్పి రవికుమార్‌పై దాడి చేశారు. ఆ తర్వాత అతని దగ్గర ఉన్న రూ.30 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి ఆటోలో పారిపోయారు. బాధితుడు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నిండుప్రాణాలు బలి

అచ్చంపేట ఆస్పత్రిలో శిశువు, కల్వకుర్తిలో బాలింత మృతి

- బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల మీనమేషాలు

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల తీరు మారడం లేదు. వైద్య సేవలు అందించడంలో తీవ్రమైన నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలవుతున్నాయి. ఈ క్రమంలో బాధితులపై చర్యలు తీసుకోవడంలోనూ సంబంధిత ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో తరుచుగా ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

– అచ్చంపేట రూరల్/కల్వకుర్తి టౌన్


వైద్యురాలితో వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకుడు, కుటుంబ సభ్యులు

కల్వకుర్తిలో బాలింత..

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతిచెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. వివరాలిలా.. పట్టణంలోని ఇందిరా నగర్‌కాలనీకి చెందిన రాజేశ్వరి(27) బుధవారం కాన్పు కోసం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి వచ్చింది. రాత్రి 11 గంటల ప్రాంతంలో కాన్పు చేయగా, ఆడపిల్లకు జన్మనిచ్చింది. కాన్పు చేస్తున్న సమయంలో బీపీ, ఫిట్స్ రాగా.. వైద్యులు చికిత్స అందిస్తూ కాన్పు చేశారు. కాన్పు తర్వాత కూడా మళ్లీ బీపీ, ఫిట్స్ రావడంతో మెరుగైన వైద్యం కోసం గర్భిణిని హైదరాబాద్‌కు, చిన్నారిని నిలోఫర్‌కు రెఫర్ చేశారు. మహిళను హైదరాబాద్‌లోని జార్జిఖానా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు చెప్పడంతో తిరిగి కల్వకుర్తికి తెచ్చారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఫిర్యాదు చేశారు. అనంతరం మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి తీసుకెళ్లారు.


రాజేశ్వరి (ఫైల్)

సుఖప్రసవం కోసం ప్రయత్నించి..

అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల మధ్య సఖ్యత లేక నిండు ప్రాణాలు బలిగొంటున్నాయి. తాజాగా పదరకు చెందిన మంజుల మొదటి కాన్పు కోసం మంగళవారం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. పురిటి నొప్పులు రావడంతో పరీక్షించిన వైద్యులు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో సుఖ ప్రసవం కోసం వైద్యురాలు స్రవంతి, నర్సులు జయమ్మ, శైలజ ప్రయత్నించారు. ప్రసవం ఆలస్యంగా కావడం అతికష్టం మీద కడుపులోని శిశువును బయటకు తీశారు. శిశువులో ఉలుకు పలుకు లేకపోవడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కుటుంబ సభ్యులు శిశువును అక్కడికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పడంతో బుధవారం రాత్రి తిరిగి అచ్చంపేట ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. రాత్రి 11గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి బీజేపీ నాయకుడు శ్రీకాంత్‌భీమా తదితరులు రోడ్డుపై రాస్తారోకో చేపట్టగా.. ఉదయం వైద్యులతో మాట్లాడిస్తామని పోలీసులు చెప్పడంతో వెళ్లిపోయారు.

అధికారుల విచారణ

వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ గురువారం ఉదయం కుటుంబ సభ్యులు బీజేపీ నాయకులు శ్రీకాంత్ భీమా, బాలాజీ, రేణయ్య, జానకి, రవీందర్ తదితరులు సూపరింటెండెంట్ కృష్ణ చాంబర్‌లో వైద్యురాలు, బాలింత కుటుంబ సభ్యుల సమక్షంలో మాట్లాడారు. ఆపరేషన్ చేయాలని బంధువులు కోరినా వైద్యురాలు చేయలేదని, నార్మల్ డెలివరీల టార్గెట్ ఉండటం వల్లనే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని శ్రీకాంత్‌భీమా ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తారనే ఉద్దేశంతో ముందస్తుగా పోలీసులు మోహరించారు. కాగా ఆస్పత్రిలో ఇంత తతంగం జరుగుతున్నా సూపరింటెండెంట్‌కు వైద్యులు సమాచారం ఇవ్వకపోవడంతో వారి మధ్య సఖ్యత లేదని తెలుస్తుంది. శిశువు మృతిచెందిన ఘటన సూపరింటెండెంట్‌కు బయటి వ్యక్తులు చెప్పిన తర్వాతనే తెలిసిందని, ఎలాంటి వివరాలను తన దృష్టికి తేలేదని ఆయన పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జయరాంరెడ్డి, డీసీహెచ్‌ఓ రమేష్‌చంద్ర ఆస్పత్రికి వచ్చి విచారణ చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలింత శరీరంపై గాయాలు

ప్రసవ సమయంలో నిండు గర్భిణి అని చూడకుండా వైద్యురాలు, సిబ్బంది కొట్టారని బంధువులు ఆరోపించారు. మోచేయి, చెంప, ఇతర శరీర భాగాల్లో కొట్టినట్లు కమిలిన గాయాలు కనిపించాయని, కడుపుపై తీవ్రంగా రాపిడి చేశారని, అందుకోసమే శిశువు మృతి చెందిందని వాపోయారు. వైద్యురాలు, నర్సుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయి చేసుకోలేదు..

ఈ నెల 22న డెలివరీ తేదీ ఇచ్చాం. సెలవు దినం అయినప్పటికీ ప్రసవాలు చేశాం. మంజుల ఆస్పత్రికి రాలేదు. 26న ఉదయం 10 గంటలకు తీసుకురాగా.. అప్పటికే ఉమ్మనీరు లేదు. గర్భిణికి నొప్పులు రాకపోయినా శిశువు తల కిందకు వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో నార్మల్ చేశాం. బేబీ హార్ట్‌బీట్ తక్కువగా కొట్టుకోవడంతో వెంటనే రెఫర్ చేశాం. మొదటి నుంచి కుటుంబ సభ్యులు నార్మల్ చేయాలని కోరారు. ఆపరేషన్‌కు వారు ఒప్పుకోలేదు. నాపైనే దాడికి యత్నించారు.

– స్రవంతి, వైద్యురాలు, అచ్చంపేట

ఇద్దరి సస్పెండ్..

అచ్చంపేట రూరల్: మహిళ ప్రసవ సమయంలో కొట్టారని వస్తున్న ఆరోపణలపై వైద్య విధాన పరిషత్ డిప్యూటీ డైరెక్టర్ జయరాంరెడ్డి విచారణలో స్వీపర్ కుర్మమ్మ, శానిటేషన్ సిబ్బంది బాలింగమ్మను సస్పెండ్ చేశారు. అలాగే మరో నలుగురు సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. విచారణ వివరాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని సదరు అధికారి పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిని వదిలేసి కిందిస్థాయి సిబ్బందిపై వేటు వేయడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

అడ్డుకున్న బీజేపీ నాయకులు

అచ్చంపేట ఆస్పత్రిలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని తప్పించి కిందిస్థాయి సిబ్బందిపై వేటు వేస్తున్నారని తెలుసుకుని ఆస్పత్రి వద్దకు బీజేపీ నాయకులు శ్రీకాంత్‌భీమా, జానకి చేరుకుని కారును అడ్డగించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి బీజేపీ నాయకులు వెళ్లిపోయారు.


కారును అడ్డుకుని బైఠాయించిన బీజేపీ మహిళా కార్యకర్త

శక్తిపీఠం ఖ్యాతి దేశవ్యాప్తం కావాలి

- అధికారులతో కలెక్టర్ సమీక్ష


కలెక్టర్‌కు ఫైల్ అందజేస్తున్న ఈఓ

జోగుళాంబ శక్తిపీఠం: తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠం అలంపురం జోగుళాంబ ఆలయాల ఖ్యాతి దేశవ్యాప్తం కావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఆలయ అభివృద్ధి పనులు జరగాలని గద్వాల కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం ఆలయ ఈఓ పురేందర్, ఆర్అండ్‌బీ ఈఈ ప్రగతి, నేషనల్ హైవే అథారిటీ కోఆర్డినేటర్స్‌తో జిల్లా కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు 44వ జాతీయ రహదారిలో అనేక రాష్ట్రాల ప్రయాణికులు ఈ మార్గం గుండా వెళ్తుంటారని అన్నారు. అలంపూర్ చౌరస్తా వద్ద బ్రిడ్జికి అలంపురం ఆలయాలు, అక్కడి ప్రాంత వైభవాలు, చారిత్రాత్మక కట్టడాలు, సుందర దృశ్యాలను ప్రయాణికులను ఆకర్షించే విధంగా పేయింటింగ్ వేయించాలని సూచించారు. అలాగే ఆలయాల వద్ద కోటగోడపై కూడా ఆధ్యాత్మిక పరమైన స్లోగన్స్, క్షేత్ర ఆవిర్భావ చరిత్రను కళ్లకు కట్టే బొమ్మలతో పాటు ఆ చరిత్రను తెలియజేస్తూ పేయింటింగ్ వేయించాలని సూచించారు. అలంపూర్ ఆలయాల నుంచి చౌరస్తాకు వెళ్లే దారిలో భైరాపురం మరియు బూడిదపాడు చౌరస్తాలో 12 అడుగుల శివలింగం మరియు నందీశ్వరుడు దర్శణం ఇచ్చే సిమెంట్ విగ్రహాల ఏర్పాటుపై సూచించారు. ఆయా స్థలాల్లో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆర్అండ్‌బీ ఈఈ ప్రగతి మరియు నేషనల్ హైవే అథారిటీ కోఆర్డినేటర్ అయిన సమీర్ మరియు సునీల్ ఆలయ ఈఓ పురేందర్‌కుమార్‌కు సూచించారు.

'సలేశ్వరం' నిత్యదర్శనం వద్దు


లింగాలలో మాట్లాడుతున్న నాయకులు

లింగాల: నల్లమల ప్రాంతంలోని సలేశ్వర క్షేత్రం నిత్య దర్శనానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని ఆలయ ట్రస్ట్ చైర్మన్, సర్పంచ్ బాలగురువయ్య, పీసా చట్టం అమలు అప్పాపూర్ గ్రామ సంఘం అధ్యక్షుడు తోకల లీలాద్రి, కార్యదర్శి నిమ్మల లింగస్వామి కోరారు. గురువారం లింగాలలో వారు విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ ఆదాయాన్ని పెంచుకోవడానికి క్షేత్రం ప్రాముఖ్యత కోల్పోయేలా ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఇలాంటి నిర్ణయాలు చేసే ముందు పీసా చట్టం గ్రామసభలో తీర్మానం చేయాల్సి ఉంటుందని తెలిపారు. చెంచుల ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చుటకు అటవీ శాఖ వారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సలేశ్వరంలో ఏటా చైత్రమాసంలో జరిగే ఉత్సవాలను 20 రోజుల పాటు నిర్వహిస్తే ఎలాంటి సమస్య ఉండదని, ఈ ఏడాది అధికారుల తప్పిదాలతో మూడు రోజులు మాత్రమే దర్శనం కల్పించడంతో తొక్కిసలాట అనివార్యమైంద అన్నారు. టూరిజంగా మారిస్తే క్షేత్రం ప్రాముఖ్యత తగ్గడమే గాక అటవీ ప్రాంతానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి ఇలాంటి నిర్ణయాన్ని మానుకోవాలని కోరారు. అటవీ శాఖ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమిస్తామని వారు తెలిపారు.

SANSKRITI VIDYALAYA
WANTED TEACHERS E/M Only
Required the following faculty to teach Classes from Nursery - V
Telugu, Hindi, English, Maths, Science, Social, Clerk.
Interview Date : 29-04-2023, 30-04-2023 (9 AM to 5 PM)
Contact : 9951299312, 9392520749

WANTED TEACHERS
Classes : VI to X English Medium
Subjects : Telugu, Hindi, English, Mathematics, Phy.Science, Bio-Science, Social Studies
Qualifications : PG / Degree+B.Ed
Salary : Negotiable
I to V Class - English Medium
Subjects : Hindi, English, Science, Social, Mathematics
Qualification : Degree / Inter + TTC / B.Ed
Salary : Negotiable
Interview : 27-4-23 to 30-4-23
9.30 AM to 5.00 PM
Note : Fluency in english is must
Contact Immediatly
SVS CENTRAL SCHOOL
English Medium Atmakur (A) Wanaparthy Dist.
✆ : 9642583166, 9440913558



పెళ్లికి అడ్డొస్తున్నాడనే హత్య



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.నరసింహ.. చిత్రంలో అదనపు ఎస్పీ, సీఐ తదితరులు

- తిర్మలాపూర్ హత్య కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: తను ప్రేమించిన అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని.. అమ్మాయి బావ నర్సింహులు అడ్డొస్తున్నాడని పథకం ప్రకారం హత్య చేసినట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాజాపూర్ మండలం తిర్మలాపూర్ సమీపంలో జరిగిన హత్య కేసు వివరాలను ఆయన వెల్లడించారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్‌కు చెందిన పుట్టపాటి రాములుకు ఇద్దరు కుమార్తెలు. 2010లో పెద్ద కుమార్తె జ్యోతిని నవాబుపేట మండలం కొల్లూర్‌కు చెందిన కావలి నర్సింహులుకు ఇచ్చి పెళ్లి చేశారు. ప్రస్తుతం అందరూ కలిసి నందిపాల్‌లో ఉంటున్నారు. రాములుకు దూరపు బంధువు అయిన చౌడాపూర్ మండలం కన్మన్‌కల్వకు చెందిన చింతల గడ్డ కేశవులు మేస్త్రీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 2019లో కేశవులు దగ్గరకు చిన్న కుమార్తె మమతను కూలీ పనికి పంపించారు. కొన్నిరోజుల పాటు అక్కడే ఉండటంతో ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే కేశవులుకు భార్యతో గొడవ జరిగి ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత కేశవులు, మమత పెళ్లి చేసుకోకుండా రెండున్నర ఏళ్లు కలిసి జీవనం సాగించారు. రానురాను కేశవులు ప్రతి చిన్న విషయానికి కొట్టడంతో మమత ఇటీవల తండ్రి దగ్గరకు వచ్చింది. మమత పెళ్లి చేయాలని నిర్ణయించి తండ్రి, బావ సంబంధాలు చూడటం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కేశవులు తనకిచ్చి పెళ్లి చేయాలని పలుమార్లు వారిని కోరినా.. పద్ధతి బాగాలేదు, ఇవ్వమని తేల్చిచెప్పారు. ఆమెకు పెళ్లయితే తనకు దక్కదని.. ఇందుకు నర్సింహులు అడ్డుగా ఉన్నాడని, తొలగించుకోవాలని భావించాడు. ఈ నెల 24న పుట్టపాటి రాములు, కావలి నర్సింహులు ఇద్దరూ కలిసి కూలీ డబ్బులు తీసుకోవడానికి తిర్మలాపూర్‌లో యాదయ్య దగ్గరకు వస్తున్న విషయం తెలుసుకున్న కేశవులు తిర్మలాపూర్ శివారులో వారిని వెంబడించి నర్సింహులును కత్తితో పొడిచి హత్య చేశాడు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ జమ్ములప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నేరస్తుడిని గురువారం అదుపులోకి తీసుకున్నామని.. కోర్టులో హాజరుపర్చనున్నట్లు వివరించారు. నర్సింహులు నుంచి కత్తి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని.. రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, సీఐ జమ్ములప్ప, ఎస్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద సీహెచ్ పట్టివేత

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద సీహెచ్ పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ హనుమనాయక్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ తెలిపిన వివరాలు... పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద గద్వాల డీటీఎఫ్ బృందం ఈనెల 24వ తేదీన తనిఖీ చేస్తుండగా అలంపూర్ చౌరస్తా వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న బైక్‌ను తనిఖీ చేయగా, అందులో 9 కిలోల సీహెచ్ గుర్తించినట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి ఇటిక్యాల మండలం బీ.వెంగనపల్లి గ్రామానికి చెందిన మునిస్వామిగా పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనం దగ్ధం

మల్దకల్: ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనం దగ్ధమైన ఘటన గురువారం మండల కేంద్రంలోని పెట్రోల్‌బంకు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ కథనం మేరకు.. మద్దెలబండకు చెందిన ఊరబావి వెంకటేష్, ఆంజనేయులు కలిసి ద్విచక్ర వాహనంపై పెట్రోల్ కోసం మల్దకల్‌కు వచ్చారు. అదే సమయంలో అయిజ నుంచి గద్వాల వైపు వెళ్తున్న ట్రాక్టర్ పెట్రోల్ బంకు దగ్గర ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్, ఆంజనేయులు కాళ్లకు తీవ్రగాయాలు కాగా.. ద్విచక్ర వాహనానికి నిప్పంటుకొని కాలి బూడిదైంది. డ్రైవర్ ఘటనా స్థలంలోనే ట్రాక్టర్‌ను వదిలేసి పరారయ్యాడు. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి క్షతగాత్రులను గద్వాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.


ఘటన స్థలంలో దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి


మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని రేషన్ డీలర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లకు నామమాత్రపు కమీషన్ ఇస్తున్నారని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ప్రభుత్వం స్పందించకుంటే వస్తే గౌరవ వేతనం.. పోతే రేషన్ డీలర్ షాప్ అనే నినాదంతో ఆందోళనలు చేపడుతామన్నారు. ఐకమత్యంగా ఉంటేనే మన హక్కులను సాధించుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వానికి సెగ తగిలేలా ఉద్యమాన్ని నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కోరారు. రాష్ట్ర నాయకులు రాజు, రవీందర్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సాదిక్‌బాషా, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు శేఖర్, వనపర్తి అధ్యక్షుడు బచ్చురాం, బాలరాజు పాల్గొన్నారు.

'కొండనాగుల'ను సందర్శించిన న్యాక్ బృందం


రికార్డులు పరిశీలిస్తున్న న్యాక్ బృందం

బల్మూర్: కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం సందర్శించింది. బృందం చైర్మన్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన వైస్ చాన్స్‌లర్ ప్రొ. అశుతోష్ ఘోష్, సమన్వయకర్త రాజస్థాన్‌కు చెందిన ప్రొ. అవంత్ వీర్‌సింగ్, సభ్యుడు మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రొ. మంగల్ మిశ్రాలు కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. వచ్చిన వారికి తెలంగాణ సంప్రదాయం ప్రకారం బతుకమ్మ, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కళాశాలలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, విద్య, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను ప్రిన్సిపాల్ మల్లేశం వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ బాలాజీ గోల్డ్: మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) రాళ్లు కట్టింగ్ చేయబడును. 90320 40019.

BUSINESS OFFER
■ కని పట్టుదల మరియు జీవితంలో ఏదైనా సాధించాలనే బలమైన కోరిక ఉండి ఏమి చేయాలో తెలియక సరైన అవకాశాలు లేక బాధపడుతున్నారా అలాంటి మీ అందరి కోసమే అద్భుతమైన వ్యాపార అవకాశం రోజుల వారాల, నెలల, స్వల్ప వ్యవధిలోనే ఒక మంచి ఆర్థిక స్థితికి చేరుకునే అద్భుతమైన అవకాశం మరిన్ని వివరాలకు సెల్: 9000907858.

WANTED
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18K, ఏజెంట్ జీతం 9K. ఫోన్ 9848571888

భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించి ఏదైనా ప్రతిస్పందించినట్లయితే మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజ్‌మెంట్